RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 138 | ఏప్రిల్ 24, 2025 | వెల : రూ.3-00



**అన్ని రంగాలలో రాణిస్తున్న రక్షణ కరువు..?**

4లో..



## అంగన్‌వాడీలో ప్రీస్కూల్‌డే నిర్వహణ

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

మండల పరిధిలోని చింతలపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ప్రీ స్కూల్ డే నిర్వహించారు. పిల్లలు ఈ సందర్భంగా యాక్టివిటీస్ చేయగా, వాటిని పిల్లల తల్లిదండ్రులు చూశారు. ప్రీ స్కూల్ డే ఉద్దేశాన్ని అంగన్‌వాడీ టీచర్ సుకినె మాలతి.. పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. 3-5 ఏండ్ల వయసున్న పిల్లలను అంగన్‌వాడీకి పంపాలని సూచించారు. అంగన్‌వాడీలో ఆట పాటలతో చక్కటి విద్యను అందిస్తున్నట్టు చెప్పారు. పిల్లలకు విద్య అభ్యసనకు ఆసక్తి కలిగేలా పాఠాలు బోధిస్తున్నట్టు స్పష్టం చేశారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.




## శిక్ష కంటే పునరావాసమే ముఖ్యం

- 'పనిష్‌మెంట్ వర్సెస్ రిహాబిలిటేషన్'పై డిస్కషన్‌లో స్టూడెంట్స్


**వేద న్యూస్, జమ్మికుంట:**


తప్పటడుగులు వేసే యువతను శిక్షించడము కంటే వారికి పునరావాసము కల్పించడం ముఖ్యమని విద్యార్థులు అభిప్రాయం వ్యక్తం చేశారు. జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ, పీజి కళాశాలలో బుధవారం కళాశాల యాంటీ డ్రగ్స్ కమిటీ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డా. బి.రమేష్ అధ్యక్షతన విద్యార్థులకు పనిష్మెంట్ (శిక్ష) వర్సెస్ రీహబిలిటేషన్ (పునరావాసం) అనే అంశం పై డిబెట్ (చర్చ) కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు రెండు బృందాలుగా ఏర్పడి ఉత్సహంగా చర్చను చేపట్టారు. డ్రగ్స్ సరఫరా చేసేవారిని, డ్రగ్స్ కు బానిసలైనవారిని శిక్షించాలని, డ్రగ్స్ మత్తులో యవత అనేక నేరాలకు పాల్పడుతున్నారని, వారిని చట్ట ప్రకారంగా శిక్షించాలని ఒక వర్గం అభిప్రాయం వ్యక్తం చేయగా, రెండో వర్గం విద్యార్థులు స్నేహితుల వల్లనో, ఇతరుల వల్లనో క్షణికావేశానికీ గురై డ్రగ్స్ కు బానిసలైనా యువకులను శిక్షించడం వల్ల వారి భవిష్యత్తు దెబ్బతింటుందని వారికి పునరావసం కల్పించి కొత్త జీవితాన్ని కల్పించడమే ఉత్తమమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.బి. రమేష్, యాంటీ డ్రగ్స్ కమిటీ కో-ఆర్డినేటర్ సి. రాజకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. రవి, ఎల్. రవిందర్, కిరణ్ కుమార్, సాయి కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ నేతలు ఓర్వలేకపోతున్నారు..!

- వక్కలంక శ్రీనివాసరావు

వివరాలు 4లో..





# ముష్కరుల ఊహాచిత్రాలు రిలీజ్

- రంగంలోకి ఎన్ఐఏ, భద్రతా సంస్థలు
- నరమేధం సృష్టించిన ఉగ్రవాదులు
- దాడుల వెనక ప్రణాళిక వెలికితీతకు అన్ని విధాలా ప్రయత్నాలు

**వేద న్యూస్, డెస్క్:**

జమ్మూకశ్మీర్ పహెల్గామ్‌లో మంగళవారం జరిగిన భీకర ఉగ్రదాడి దేశవ్యాప్తంగా విషాద ఛాయలను నింపింది. ఈ ఘటనలో సుమారు 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోగా, అనేక మంది గాయపడ్డారు. ఈ దాడి బాధితుల కుటుంబాలు ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ నుంచి మహారాష్ట్రలోని పన్వేల్ వరకూ, ఒడిశా నుంచి గుజరాత్ వరకూ శోకసంద్రంలో మునిగిపోయాయి. ఈ దాడి 2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత జరిగిన అతిపెద్ద ఉగ్రదాడుల్లో ఒకటిగా చెప్పుకోవచ్చు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్‌లో పర్యటిస్తున్న సమయంలో ఉగ్రవాదులు జమ్మూకశ్మీర్‌లో బరితెగించి ఏకంగా పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని దాడి చేయడం సంచలనంగా మారింది. ఈ ఘటనలో ఇప్పటివరకు సుమారు 26 మంది టూరిస్ట్‌లు మరణించగా.. 20 మంది ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నా రు. ఈ పహెల్గామ్ ఉగ్రదాడిని ప్రధాని మోడీ తీవ్రంగా పరిగణించి.. ఉగ్రవాదులకు వార్నింగ్ ఇచ్చారు.

### మృతుల్లో విదేశీయులు

ఈ ఘటనపై దర్యాప్తు జరిపేందుకు ఎన్ఐఏ కూడా రంగంలోకి దిగింది. ఇక సైనిక దుస్తుల్లో వచ్చిన ఏడుగురు ఉగ్రవాదులు..ఈ మారణ హోమానికి తెరలేపినట్టు ప్రాణాలతో బయట పడిన ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. కనిపించిన వారిని కనిపించినట్లే పాయింట్ బ్లాంక్‌లో తుపాకీ పెట్టి కాల్చినట్లు పేర్కొన్నారు. అది ఒక భయానక ఘటనగా వారు అభివర్ణిస్తున్నారు. మతం ఏంటని.. పేరు ఏంటని అడిగి మరీ కాల్పులు జరిపినట్లు పర్యాటకులు చెబుతున్నారు. ఐడీ కార్డులు ఇవ్వాలని వారిని బెదిరించినట్లు చెప్పారు. గాయపడిన క్షతగాత్రులు మహారాష్ట్ర, గుజరాత్, యూపీకి చెందిన వారుగా గుర్తించారు. పలువురు విదేశీ పర్యాటకులు కూడా మృతుల్లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరికొందరు బుల్లెట్ గాయాలతో ప్రాణాలు దక్కించుకునేందుకు ఆర్తనాదాలు చేశారు. ఇక బైసరన్ ప్రాంతంలో తుపాకీ కాల్పుల శబ్దాన్ని విన్న సైన్యం.. హుటాహుటిన అక్కడికి చేరుకుంది. హెలికాప్టర్ సాయంతో గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ




బైసరన్ ప్రాంతానికి కేవలం కాలినడకన లేదా గుర్రాలపై మాత్రమే చేరుకునే అవకాశం ఉండటంతో బాధితులను వేగంగా తరలించడం సైన్యానికి కష్టతరం అయింది. ఇక ఈ ఉగ్రదాడికి పాల్పడింది తామే అంటూ టీఆర్ఎఫ్ ప్రకటించింది.

### అమర్‌నాథ్ యాత్రికుల్లో ఆందోళన

మరోవైపు..త్వరలోనే మంచు కొండల్లో పవిత్రమైన అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం కానున్న వేళ.. ఈ భారీ ఉగ్రదాడి జరగడం తీవ్ర సంచలనంగా మారింది. 38 రోజుల పాటు కొనసాగే అమర్‌నాథ్ యాత్ర జూలై 3వ తేదీన ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది యాత్రికులు రెండు మార్గాల్లో చేరుకోనున్నారు. అనంత్‌నాగ్ జిల్లాలో పహెల్గాం మార్గంలోనే 48 కిలోమీటర్ల మేర ఉండగా..14 కిలోమీటర్ల మార్గం గండేర్బల్ జిల్లా నుంచి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో తాజాగా పర్యాటకులపై ఉగ్రదాడి జరగడం అమర్‌నాథ్ యాత్రికులకు తీవ్ర భయాందోళన కలిగిస్తోంది.

### భద్రతా దళాలూ రంగంలోకి..

పహెల్గాంలో పర్యాటకులపై దాడి చేసిన ముగ్గురి ఉగ్రవాదుల స్కెచ్‌లను భద్రతా సంస్థలు విడుదల చేశాయి. వీరిని ఆసిఫ్ ఫౌజి, సులేమాన్ షా, అబు తాలాగా గుర్తించారు. మూసా, యూనిస్, ఆసీఫ్ అనే కోడ్‌నేమ్‌లు కూడా ఉన్నట్లు తెలిపారు. ఆ ముగ్గురు పూంచ్‌లో జరిగిన

మిగతా 4వ పేజీలో..

## రైల్వే సమస్యలను పూర్తి చేయాలని వినతి


**వేద న్యూస్, కాజీపేట :**



దక్షిణ మధ్య రైల్వే జనరల్ మెనేజర్ అరుణ్ కుమార్ జైన్‌తో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సమావేశం అయ్యారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యలను పూర్తి చేయాలని బుధవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో జీఎంకు వినతి పత్రం అందజేశారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ లో కీలకమైన కాజీపేట జంక్షన్ ప్రాముఖ్యతను ఎట్టి పరిస్థితుల్లో తగ్గకుండా చూడాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య రైల్వే జీఎంను కోరారు. కాజీపేట లోకో రన్నింగ్ డిపో సిబ్బందిని విజయవాడలోని లోకో రన్నింగ్ డిపో బదిలీ చేయడం, ప్రస్తుతం కాజీపేట లోకో రన్నింగ్ స్టేషన్ లో కొత్త పోస్టుల భర్తీకి అధికారులు ఎలాంటి ప్రయత్నాలు చేయకపోవడం వంటి విషయాలపై రైల్వే జీఎం ను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య వివరణ కోరారు. కాజీపేటలో 709 మంది ఉద్యోగుల సంఖ్యకు కేవలం 526 మంది ఉద్యోగులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని తెలియజేశారు. ప్రస్తుతం కాజీపేట లోకో రన్నింగ్ స్టేషన్‌కు 184 కొత్త పోస్టింగ్‌లు మంజూరు చేసినప్పటికి, పోస్టుల భర్తీకి అధికారులు ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని, దీని వల్ల ఉన్న ఉద్యోగులపై అధిక భారం పడుతుందని ఎంపీ రైల్వే జిఎంకు వివరించారు.

ఇప్పుడు కీలకమైన కోచింగ్ క్రూ లింక్‌లను రైల్వే అధికారులు బదిలీ చేయాలని నిర్ణయించుకున్నారని, జూలై 14, 2022న జరిగిన జాయింట్ కమిటీ సమావేశంలో రైల్వే అథారిటీ ఇచ్చిన హామీని ఉల్లంఘించి, కృష్ణా, ఎల్‌టిటి, కోణార్క్ మరియు గౌతమి ఎక్స్‌ప్రెస్‌లను కాజీపేట నుండి విజయవాడ డిపోకు తలుస్తున్నారని పేర్కొన్నారు. మంగళవారం నుండి ఈ ఎక్స్ ప్రెస్ లింకులను విజయవాడ నుండి ఆపరేట్ చేస్తున్నట్లు అందుకు సంబంధించిన ఛార్జ్ తయారు చేశారని తెలిపారు. గతంలో ఈ లింకును కాజీపేట డిపో వారే అప్ అండ్ డౌన్ రూట్లో నడిపే వారని పేర్కొన్నారు. ఇప్పుడు ఈ నాలుగు క్రూ లింకులను మార్చకుండా యధావిధిగా కొనసాగించాలని రైల్వే జీఎంను ఎంపి కోరారు. అమృత్ భారత్ పథకం కింద వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

అంతేకాకుండా కాజీపేట బస్టాండ్ ఏర్పాటుకు త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. గతంలో అధికారులతో కలిసి స్థలం పరిశీలన చేసినట్లు వెల్లడించారు. స్థల నిర్ణయం ప్రకటిస్తే వెంటనే బస్టాండ్ నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత నిర్ణయాలతో కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. రైల్వే యూనియన్ తో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరించాలని ఎంపీ జిఎంను కోరారు. వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య అభ్యర్థనల పట్ల రైల్వే జీఎం సానుకూలంగా స్పందించారన్నారు. వరంగల్ ఎంపీ కోరినట్లు డివిజన్ ఏర్పాటుకు ఎలాంటి అడ్డంకులు లేకుండా, కాజీపేట ప్రాముఖ్యతను తగ్గకుండా రైల్వే సమస్యలను పరిష్కరిస్తామని రైల్వే జీఎం తెలిపారని ఎంపీ వివరించారు. మూడు రోజుల్లో రైల్వే యూనియన్ తో సమావేశమై వారి సమస్యలు పరిష్కరిస్తామని రైల్వే జీఎం తెలిపారని అన్నారు. ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తో పాటు ఎంపీలు రఘురాం రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



## ఉగాది నూతన డైరీ ఆవిష్కరణ

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:**

సూర్యాపేట జిల్లాల కేంద్రంలో ఉన్న విశ్వనాథ స్వామి దేవాలయ ప్రాంగణంలో సూర్యాపేట జిల్లా జేఏసీ అధ్యక్షులు దుపదీప నైవేద్య సంఘం అధ్యక్షులు రాష్ట్ర కార్యదర్శి సభ్యులు వలివేటి వీరభద్ర శర్మ, సాగర్ శర్మ ఆధ్వర్యంలో దేవాలయ సిబ్బందితో కలిసి 2025 ఉగాది నుండి ఉగాది నూతన డైరీని మంగళవారం రాత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేందర్ శర్మ పాల్గొని మాట్లాడుతూ ఇప్పటివరకు ఇరవై ఒక్క జిల్లాల పర్యటన జరిగిందని ఇంకా 12 జిల్లాల పర్యటన చేయాల్సి ఉందని అన్నారు. పర్యటనలో భాగంగా వివిధ దేవాలయాల ఉద్యోగులను కలుసుకొని వాళ్ల సమస్యలు తెలుసుకొని కొన్ని సమస్యలను దేవాదాయ శాఖ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకపోతూ ముందుకు సాగడం జరుగుతుందని అన్నారు. జిఐఏ ద్వారా వేతనాలు తీసుకునే అర్చక ఉద్యోగులు అదేవిధంగా ధూపదీప నైవేద్యార్చకులు వారి వేతనాలు సకాలంలో రావడంలేదని ఆవేదన వెలుబుచుతున్నారని వారి సమస్యలను ఫైనాన్స్ డిపార్ట్మెంట్ వారికీ తెలియజేయడం జరుగుతుందని ఈసందర్భంగా ఉపేంద్ర శర్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా అర్చక ఉద్యోగ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదులను కాల్చి చంపాలి..!

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

కాశ్మీర్ లోయలోని అనంత నాగ్ జిల్లా పహాల్గంలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో మరణించిన వారి కుటుంబాలకు బీసీ సంక్షేమం తరఫున ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఉగ్రవాదుల దాడిలో మరణించిన హైదరాబాద్ కు చెందిన ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి మనీశ్ తివారి చిత్రపటానికి మిర్యాలగూడ లోని అమర వీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం లింగంగౌడ్ మాట్లాడుతూ ప్రకృతి అందాలను వీక్షించడానికి వచ్చిన పర్యాటకులపై హఠాత్తుగా దాడికి పాల్పడడం పిరికి పందుల చర్యగా అభివర్ణించారు.సైనిక దుస్తుల్లో వచ్చి అమాయకులపై విచక్షణ రహితంగా కాల్పులు జరపడం అనేది చేతకానితనానికి నిదర్శనం,ఉగ్రవాదుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని,దీనికి ప్రతీకారం తీర్చు కోవాల్సిందేనని కాల్పులకు పాల్పడిన నిందితులను త్వరగా పట్టుకొని కాల్చి చంపాలని అప్పుడే చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరుతుందన్నారు. బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు మహేష్ గౌడ్, మునుకుంట్ల సైదులు, శరత్, వంశీ, సందీప్, వీరరాజు, జగన్,శ్రీనివాస్,వెంకటేష్,సతీష్,నరేశ్,రవి తదితరులు పాల్గొన్నారు.



## ఎల్కతుర్తి సభను విజయవంతం చేద్దాం

- బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కట్ట మల్లేష్ గౌడ్

4లో..

వేద న్యూస్
గురువారం, ఏప్రిల్ 24, 2025

# జర్నలిస్ట్ నజీర్ ఖాన్ కి ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు



**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:**

సూర్యాపేట పట్టణ కేంద్రానికి చెందిన నజీర్ ఖాన్ కి ఉత్తమ జర్నలిస్ట్ అవార్డ్ ని ఆసియన్ వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ, స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్, పీస్ ఆఫ్ ఇండియా ఎన్జీవో, స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో, ఆసియా వేదిక్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఎన్ టి ఆర్ ఆడిటోరియం నాంపల్లి లో డాక్టర్ లయన్ ఆకుల రమేష్ చేతుల మీదుగా ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు ను వాటికి సంబంధించిన సర్టిఫికెట్ మెడల్ ని అందజేశారు. ఈ సందర్భంగా నజీర్ ఖాన్ మాట్లాడుతూ ఈ అవార్డ్ రావడంతో తనకి ఇంకా ఎక్కువ బాధ్యత పెరిగిందని అన్నారు. తాను చేస్తున్న సామాజిక సేవలు మీడియా సేవలను గుర్తించి అవార్డును అందించిన డాక్టర్ ఆకుల రమేష్ కి ధన్యవాదములు తెలిపారు. అవార్డ్ రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# భాగస్వామ్య గ్రామీణ అంచనా పై అవగాహన సదస్సు



**వేద న్యూస్, హుజురాబాద్ :**

హుజురాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని రాంపూర్ లో ఎస్ఆర్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్ (పిఆర్ఏ) గ్రామీణ విశ్లేషణాత్మక తులనం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం నుండి విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ మహేష్, కెవికె ఆర్ ఎడబ్ల్యూ ఈపీ కో- ఆర్డినేటర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పిఆర్ఏ లో విద్యార్థులు సోషల్ మ్యాపింగ్, చపాతి పటం, వెన్ రేఖ చిత్రాలు వంటి వివిధ భాగస్వామ్య, పద్ధతులను ఉపయోగించి స్థానిక సంఘంతో సమావేశమయ్యారు. విద్యార్థుల ప్రయత్నాలు ఈ ప్రాంతంలో స్థిరమైన వ్యవసాయాభివృద్ధికి, కీలక సమస్యలను, అవకాశాలను గుర్తించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో డీన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ భూపాల్ రాజ్, ఆర్ఎ డబ్ల్యూ ఈ పి కో- ఆర్డినేటర్ శ్రీకర్ రెడ్డి, శాస్త్రవేత్త డాక్టర్ మహేష్, కెవికె ఆర్ ఏడబ్ల్యు ఈపి కో- ఆర్డినేటర్ విష్ణువర్ధన్ మార్గదర్శకత్వంతో విద్యార్థులు మెను మొసెస్,ప్రణయ్, అభిషేక్, నవీన్,ఆలీ, రంజిత్, సాయి,పవన్, రాజేష్, సమద్, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

### ఉగ్రదాడిని ఖండిస్తూ

# కొవ్వొత్తుల ర్యాలీ



**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

జమ్మూకశ్మీర్ పహెల్గాంలో టూరిస్టులపై ఉగ్రవాదులు జరిపిన ఉగ్రదాడికి నిరసనగా బుధవారం బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ముష్కరులు జరిపిన నరమేధానికి నిరసనగా ర్యాలీ నిర్వహించి.. అమరులకు నివాళు లర్పించారు. టూరిస్టుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉగ్రదాడులు చేసిన వారికి తగు మూల్యం తప్పక కేంద్రం చెల్లిస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, నేతలు ధీమా వ్యక్తం చేశారు. ర్యాలీలో బీజేపీ శ్రేణులు, సానుభూతిపరులు పాల్గొన్నారు.



### సిగ్నల్ జంక్షన్ లలో

# నీడతెరల ఏర్పాటు

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

బల్దియా పరిధి లోని ప్రధాన కూడళ్లలోని సిగ్నల్ జంక్షన్ లలో కమిషనర్ ఆదేశం మేరకు నీడ తెరలను ఏర్పాటు చేస్తున్నట్లు బల్దియా ఎస్ఈ ప్రవీణ్ చంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం నేపథ్యంలో సిగ్నల్ జంక్షన్ లు గల ప్రాంతాల్లో సిగ్నల్ పడినపుడు వాహనదారులు గ్రీన్ సిగ్నల్ వచ్చేవరకు వేచి ఉండాల్సి వస్తుందని అన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయి కి చేరుకునే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తాత్కాలిక ఉపశమనం కోసం బల్దియా పరిధి హన్మకొండ ప్రాంతంలోని ప్రధాన కూడళ్లు ఐన అదాలత్ జంక్షన్, పోలీస్ హెడ్ క్వార్టర్ జంక్షన్, అశోక జంక్షన్, ములుగు రోడ్ జంక్షన్, కాకతీయ యూనివర్సిటీ జంక్షన్ తో పాటు వరంగల్ లోని కాశిబుగ్గ, పోచమ్మ మైదానం జంక్షన్ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

### లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట

# నూతన కమిటి ఏకగ్రీవంగా ఎన్నిక



**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి :**

లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట 2025-2026 సంవత్సరానికి గాను నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షులు మిరియాల సుధాకర్ తెలిపారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని లయన్స్ సర్వీస్ సెంటర్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేటకు నన్ను అధ్యక్షునిగా, కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అధికారులకు, లయ న్స్ సభ్యులకు, లయన్స్ పెద్దలకు ఎన్నిక కొరకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కమిటీలో ప్రధాన కార్యదర్శిగా గుండా లక్ష్మయ్య కోశాధికారిగా పాశం అనంత రావు ఉపాధ్యక్షులుగా ఈగ దయాకర్ గుప్తా, ఎర్రంశెట్టి ఉపేందర్, జాయింట్ సెక్రెటరీగా చీకూరి కృష్ణ గౌడ్, మెంబర్షిప్ చైర్మన్ గా మలీగి రెడ్డి కృష్ణారెడ్డి, సర్వీస్ చైర్మన్ గా కుమ్మరి కుంట్ల లింగయ్య, మార్కెటింగ్ చైర్మన్ గా శివరాత్రి రవి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ గా వాంకుడోత్ వెంకన్న, స్కూల్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ గా పుట్టా వెంకన్న, డయాబెటిక్ క్యాంపు చైర్మన్ గా ముద్ద బిక్షపతి యాదవ్, ఫండ్ రైజింగ్ చైర్మన్ గా అండే0 వెంకన్న, ఐ డొనేషన్ చైర్మన్ గా వెంపటి శబరి నాథ్, సోషల్ మీడియా చైర్మన్ గా మీలా వంశీ లు ఎన్నికైనట్లు తెలిపారు. ఈ కమిటీకి ఎన్నికల అధికారులుగా పటేల్ నరసింహారెడ్డి, పెండెం చంద్రశేఖర్, ఉప్పల రాజేంద్రప్రసాద్ లు వ్యవహరించినట్లు తెలిపారు.

### ఇందిరమ్మ ఇండ్ల

# వెరిఫికేషన్ పారదర్శకంగా జరగాలి

– కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**

ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్ పారదర్శకంగా జరగాలని అధికారులకు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికకు నియమితులైన వెరిఫికేషన్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకానికి అర్హులైన లబ్ధిదారులను ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేసిన నివేదికల ననుసరించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయుట, పరిశీలించుటకు ఎంపీడీవోలు ఎ.ఈ, ఏ.ఓ.,ఎంపీవో లను టీం గా ఏర్పాటు చేసిన బృందానికి పర్యవేక్షణ అధికారిగా మండలాల ప్రత్యేక అధికారులుగా ఉంటారని అన్నారు. జిల్లాలోని మండలాలతో పాటు మున్సిపాలిటీలను కలిపి మొత్తం 86 మంది వెరిఫికేషన్ అధికారులను నియమించడం

జరిగిందని, ఈ మొత్తం ప్రక్రియ ఏప్రిల్ 30 వరకు పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపికలో వెరిఫికేషన్ అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలన్నారు. వెరిఫికేషన్ అధికారులు వెరిఫికేషన్ లిస్టులో ఉన్న వాటి వివరాలను నమోదు చేయాలన్నారు. ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే రిమార్క్స్ కాలమ్ లో నమోదు చేయాలన్నారు. వెరిఫికేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలన్నారు. వెరిఫికేషన్ అధికారులు ఏవైన సందేహాలు ఉన్నట్లయితే ఎంపీడీవో, హౌసింగ్ పీడీల ద్వారా అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. వెరిఫికేషన్ కోసం క్షేత్రస్థాయికి వెళ్ళినప్పుడు చుట్టుపక్కల వారిని కూడా అర్హులా కాదా అనేది విచారించాలని, వివరాలు అన్నీ కూడా సరిగా నమోదు చేయాలన్నారు. వెరిఫికేషన్ లో ఎలాంటి తప్పులు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పథకానికి అర్హులైన అత్యంత నిరుపేదలు, అసలు ఇల్లు లేని వారిని ఎంపిక చేయాలన్నారు. వేసవి వడగాలుల దృష్ట్యా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఉపాధి పనులు మరే ఇతర పనులకు వెళ్ళే అవకాశం ఉన్నందున వెరిఫికేషన్ టీం లబ్ధిదారులు ఇంటివద్ద ఉన్న సమయంలో వెళ్లాలని అన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ వెరిఫికేషన్ టీం లకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే లు ఐడి కార్డ్స్, క్యాప్స్ అందజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జి. సంధ్యా రాణి, డిఆర్ఓ విజయలక్ష్మి, జడ్పి సీఈవో రాంరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, హౌసింగ్ పిడి గణపతి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, జిల్లా అధికారులు, ఎంపీడీవో, ఎంపీవోలు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### బిజెపి ఆధ్వర్యంలో ఉగ్రవాదుల

# దిష్టిబొమ్మ దగ్ధం



**వేద న్యూస్,మాడ్గులపల్లి:**

జమ్ము కాశ్మీర్ లో ఉగ్రవాదుల దాడుల్లో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, బిజెపి మండల అధ్యక్షులు ఇటికాల జాన్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మాడ్గులపల్లి మండల కేంద్రంలో కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి నార్కట్ పల్లి- అద్దంకి రహదారి పై ప్రదర్శన నిర్వహించి ఉగ్రవాద దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ అమాయక పర్యాటకుల మీద ఉగ్రవాదమూకలు దాడి చేయడం ఉగ్రవాదసంస్థల పిరికిపంద చర్యగా అభివర్ణించారు. శాంతి భద్రతలకు విఘాదం కలిగించే ఉగ్రవాద సంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోని ఉగ్రవాదాన్ని కూకటి వేళ్ళతోరూపుమాపలని ఉగ్రవాద సంస్థలు ఎక్కడ ఉన్నా వెతికి వెతికి స్థావరాలపై దాడి చేసి ఉద్రవదాం లేకుండా చేయాలన్నారు. భారతీయ జవాన్లు తక్షణ చర్యలు తీసుకొని ఉగ్రవాదుల చేతుల నుంచిదేశాన్ని కాపాడాలని అయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు బొమ్మకంటి నరసింహ, నాయకులు రాంరెడ్డి,దాసరి యాదగిరి, దారమల్ల నాగరాజు, గురుస్వామి,శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి,గంగరాజు,ప్రభాకర్ గౌడ్,బూత్ అధ్యక్షులు సైదులు, వెంకటరెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

### భద్రకాళి చెరువు పూడికతీతలో

# వేగం పెంచాలి



**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

భద్రకాళి చెరువు పూడికతీత పనుల్లో మరింత వేగం పెంచాలని కుడా వైస్ చైర్మన్, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. బుధవారం భద్రకాళి చెరువులో కొనసాగుతున్న పూడికతీత పనులను క్షేత్రస్థాయిలో వైస్ చైర్మన్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే పరిశీలించారు. కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో మూడు లక్షల క్యూబిక్ మీటర్ల మేర పూడిక తీత లక్ష్యం కాగా ఇప్పటివరకు చెరువులో రెండు లక్షల క్యూబిక్ మీటర్ల డిసిల్టేషన్ చేయడం జరిగిందని అధికారులు వైస్ చైర్మన్ కు వివరించగా, పనుల్లో మరింత వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూడా ప్రాజెక్టు అధికారి అజిత్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భీమ్రావు తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టర్ బస్తీని డెవలప్ చేయండి

- 18వవార్డు వాసుల వినతి
- బస్తీ ఏర్పడి వందేండ్లయినా అభివృద్ధిలో వెనకంజ
- డ్రైనేజీ పొంగిపొర్లుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన

**వేద న్యూస్, బెల్లంపల్లి:**

బెల్లంపల్లి పట్టణంలోని 18వ వార్డు అలియాస్ కాంట్రాక్టర్ బస్తీని డెవలప్ చేయాలని ఆ వార్డువాసులు కోరుతున్నారు. ఎమ్మెల్యే ఫండ్స్ ద్వారా అభివృద్ధి చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఉన్న కాంట్రాక్టర్ బస్తీ ఏర్పడి వందేండ్లు అయినా అభివృద్ధిలో వెనకబడి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆ వార్డు వాసులు రాజేశం, రామ్ మోహన్, రాజు, నాగ భూషణం, చంద్రమొగిలి, రవి కుమార్, నాగేష్, రాంచందర్, కార్తీక్, నాగరాజు, రాకేష్, హబీబ్, కొలిపాక శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. అన్ని వార్డుల కన్నా తమ వార్డు నుంచి అధికంగా ఆస్తి పన్ను వసులు చేస్తూ.. అభివృద్ధి విషయంలో పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. బస్తీలోని భవిత డిగ్రీ కాలేజీ వద్ద అండర్ డ్రైనేజీ నిండిపోయిన విషయంపై బస్తి వారు ఎన్నో సార్లు మున్సిపాలిటీలో కంప్లయింట్ చేసినా పట్టించుకోవడం లేదని వెల్లడిస్తున్నారు. బస్తీలో ఆంధ్రబ్యాంకు వద్ద సులభ్ టాయిలెట్ నిర్మించి ఐదేండ్లు గడిచినా ప్రారంభానికి నోచుకోలేదని పేర్కొంటున్నారు. తమ వార్డులోకి అంబులెన్సులు రాకుండా మెయిన్ రహదారులను కొందరు కబ్జా చేశారని ఆరోపిస్తున్నారు. తమ వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధి చేయాలని అధికారులను అభ్యర్థిస్తున్నారు.



## పూజా కార్యక్రమాలు నిర్వహించిన రవీందర్రావు



**వేద న్యూస్, డెస్క్:**

వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక నగరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ భవన నిర్మాణ కార్యక్రమంలో భాగంగా బుధవారం రోజు దర్వాజా ఎత్తుట పూజా కార్యక్రమాలు నిర్వహించిన డిసిసి అధికార ప్రతినిధి నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ తక్కల్లపల్లి రవీందర్రావు ఇట్టి కార్యక్రమం నిర్వహిస్తుండగా కార్యకర్తలు రోడ్డుపై నిలుచొని ఉండగా అనుకోకుండా కొత్తగూడ వైపు వెళ్తున్న తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క, రవీందర్రావును చూసి కారు ఆపిన సందర్భంలో ప్రభుత్వ పథకాలు బాగా అమలు జరుగుతున్నాయా పంటలు ఎలా పండాయని అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేసి స్థానిక శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి సహకారంతో మీ గ్రామాభివృద్ధికి తగినన్ని నిధులు కేటాయిస్తానని ఈ సందర్భంగా హామీ ఇవ్వడం జరిగింది. ఇట్టే కార్యక్రమంలో అశోక్ నగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు.ఎల్ది శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టి సారంగపాణి, సొసైటీ డైరెక్టర్ జాడి అచ్యుత్, అయోధ్య నగర్ గ్రామ పార్టీ అధ్యక్షులు గుండ్ల యాకన్న, మాజీ వార్డ్ మెంబర్ పోనుకోటి ప్రవీణ్ రావు, ఉపాధ్యక్షులు కదురు సారయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కూస మునేందర్, గ్రామ నాయకులు బొంపల్లి అనిల్, జాడి వెంకటేష్, కదురు సమ్మయ్య, కొత్త మల్లయ్య, బొమ్మగాని ఉప్పలయ్య, ఇరుకు సాగర్ రావు, ఆలువల రమేష్, ఎండి సమాద్ గ్రామ ప్రజలు పార్టీ కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక సౌకర్యాలతో విద్యను అందిస్తాం

- ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా బడిబాట కార్యక్రమం నిర్వహించాలి - ఎమ్మెల్యే బీఎల్ఆర్

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



వేసవి సెలవుల్లోనూ ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా బడిబాట కార్యక్రమం చేపట్టాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో వర్చువల్ (జూమ్ )మీటింగ్లో పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం బడిబాట షెడ్యూల్ ఇవ్వనప్పటికీ గత వారం రోజులుగా విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా గ్రామాలలో ప్రతీ ఇళ్లు తిరుగుతూ తల్లిదండ్రులను ఒప్పించి నమోదు చేయిస్తున్నందున ఉపాధ్యాయులందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఇదే స్ఫూర్తితో అంగన్వాడిల నుండి ఐదు సంవత్సరాలు నిండిన విద్యార్థుల జాబితా సేకరించి ప్రాథమిక పాఠశాలలో చేర్పించడం ఐదవ తరగతి పూర్తి అయిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ఉన్నత పాఠశాలలో చేర్పించే విధంగా ఉపాధ్యాయులందరూ బాధ్యత వహించాలని సూచించారు. ఉపాధ్యాయులందరూ బృందాలుగా ఏర్పడి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు ఆధునిక వసతులు డిజిటల్ తరగతులు కంప్యూటర్ ల్యాబ్ లను వివరించి నమోదు చేయించాలని పేర్కొన్నారు.జూన్ మాసంలో ప్రభుత్వం ద్వారా అధికారికంగా నిర్వహించబడే ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో తనతో పాటు కార్యకర్తలు బిఎల్ఆర్ బ్రదర్స్ అందరూ ఉపాధ్యాయులతో మమేకమై పాఠశాలల బలోపేతానికి చేయూతనందిస్తామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని 29 ఉన్నత పాఠశాలలో సాయంత్రం పూట అదనపు తరగతులు నిర్వహించుటకు దాతల సహకారంతో వాలంటీర్లను ఏర్పాటు చేసి విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి తోడ్పాటునందిస్తానని తెలిపారు. నిరుపేద అట్టడుగు వర్గాల విద్యార్థులు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని ఉపాధ్యాయులందరూ ఉద్యోగ బాధ్యతతో పాటు సామాజిక బాధ్యతగా స్వీకరించి వారి జీవితాలలో వెలుగులు నింపాలని ఉన్నత ప్రమాణాలతో విద్యను అందించి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తయారు చేయాలని అదే ఈ బిఎల్ఆర్ ఆకాంక్ష అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు ఎం బాలాజీ నాయక్,బుక్య లక్ష్మణ్ నాయక్,వరలక్ష్మి,వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నుండి రాష్ట్రాన్ని కాపాడాలి

- జిమ్ ఓనర్స్, కోచ్లకు మాదకద్రవ్యాలు, సింథటిక్ ఇంజెక్షన్స్, స్టెరాయిడ్స్ వాడకాలపై అవగాహన సదస్సు
- నార్కోటిక్ డీఎస్పీ కె. సైదులు

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**




ఎవరైనా స్టెరాయిడ్స్ ఉపయోగిస్తే చట్టరీత్య చర్యలు తీసుకోవడం జరుగుతుందని నార్కోటిక్ డీఎస్పీ కె. సైదులు హెచ్చరించారు. నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య ఆదేశాల మేరకు ఎస్పీ రూపేష్ ఐపీఎస్ పర్యవేక్షణలో బుధవారం నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్ లో వరంగల్ నగర పరిధిలోని జిమ్ ఓనర్స్, కోచ్లకు మాదకద్రవ్యాలు, సింథటిక్ ఇంజెక్షన్స్, స్టెరాయిడ్స్ కు సంబంధించి వరంగల్ నార్కోటిక్ పోలీస్ స్టేషన్ లో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నార్కోటిక్ డీఎస్పీ కె. సైదులు, ఇన్స్పెక్టర్ బి. రవిందర్, మట్టేవాడ ఇన్స్పెక్టర్ గోపి గంజాయి, ఇతర మాదకద్రవ్యాల కొనుగోలు, అమ్మకం, రవాణా, వాడకంపై, స్టెరాయిడ్స్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. కస్టమర్ల ఫోన్ నంబర్లు, ఆధార్ కార్డుల సేకరణ, జిమ్ లో సీసీ కెమెరాల పర్యవేక్షణ గురించి పలు సూచనలు చేశారు. అనంతరం నార్కోటిక్ డీఎస్పీ కె. సైదులు మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణా, వినియోగాన్ని పూర్తిగా నిరోధించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్నదని, ఇందులో భాగంగానే నార్కోటిక్స్ బ్యూరో ఏర్పాటు చేయబడిందని ఆయన తెలిపారు.

మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు నార్కోటిక్స్ బ్యూరో కఠిన చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. దీనిని నిరోధించడం ప్రతీ పౌరుడి బాధ్యత. మన రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల ముప్పు నుండి రక్షించేందుకు ప్రతి ఒక్కరు కలసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ కి సంభందించిన అమ్మకాలు, కొనుగోలు చేసే వారి వివరాలు తెలిసినచో, టోల్ ఫ్రీ నంబర్: 1908,టిజిఏఎన్ బి కంట్రోల్ రూమ్ నంబర్: 8712671111 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని తెలిపారు. ఈ సమావేశంలో నార్కోటిక్ డీఎస్పీ కె. సైదులు ఇన్స్పెక్టర్ బి. రవిందర్, మట్టేవాడ ఇన్స్పెక్టర్ గోపి, నార్కోటిక్ పీసీ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# తీర్చుకుంటాం ప్రతీకారం..ఇది తథ్యం..!

- హిందువులపై మారణకాండను హిందుస్థాన్ సహించదు
- పహల్గామ్ దాడులను మరువం
- బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**




పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడి దేశ హృదయాన్ని కలిచివేసింది. మానవత్వం లేని మృగాలు చేసిన ఒక పిరికిపందల చర్య ఇది. పర్యాటకులపై జరిగిన ఈ అమానుష దాడిలో 27 మంది అమాయక హిందువులు ప్రాణాలు కోల్పోవడం, మరికొందరు తీవ్రంగా గాయపడటం దురదృష్టకరం, బాధాకరమని బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాద ఘటనను తీవ్రంగా ఖండించారు. బుధవారం సాయంత్రం వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుంచి పాపయ్యపేట చమన్ వరకు మౌనంగా కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ ఇలాంటి పిరికిపందల దాడులతో భారత్‌ను భయపెట్టలనుకోవడం పిరికిపందుల చర్య అన్నారు. మోదీ సర్కార్ ఎప్పటికీ కవ్వింపు చర్యలను సహించదు. దేశ భద్రతపై గట్టి స్థానంలో ఉంది. ప్రతి అమాయక ప్రాణం వెనుక న్యాయం నిలబడే వరకు కేంద్ర ప్రభుత్వం నిద్రపోదు. తప్పకుండా మూల్యాన్ని చెల్లించుకోవాల్సిందే అన్నారు. ఇది కేవలం దాడి కాదు, ఇది మానవత్వాన్ని చీల్చే ప్రయత్నం. దేశం మొత్తంగా ఈ విషాదం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఇలాంటి ఘటనలపై ఏ ఒక్క భారతీయుడు కూడా ఊరుకోడని గంట రవికుమార్ వ్యాఖ్యానించారు. పాకిస్తాన్ లో రాజకీయంగా, ఆర్థికంగా అస్థిరత ఉన్నప్పటికీ, ఆ దేశం తమ అంతర్గత వైఫల్యాలను ధ్వంసకాండాలుగా మారుస్తూ భారత్ పై కుట్రలు చేస్తున్నది. కానీ భారత్ సహనం, శక్తి, సంఘీభావం కలగలిసిన దేశం. ఈ దేశ పౌరుల మీద దాడి జరిగితే నిశ్శబ్దంగా ఉండే దేశం కాదు. ఇప్పటికే పాకిస్తాన్ ఆర్థిక పరిస్థితి అధ్వాన్నం అయింది. ఇక ఇప్పుడు మళ్ళీ దాడులతో రెచ్చగొట్టే తమ పతనాన్ని తామే రచ్చించుకున్నారు అని అన్నారు. ఈ దేశంలోని కొంతమంది ముస్లింలు కూడా ఈ దాడుల విషయంలో మౌనంగా ఉండడం సరైనది కాదన్నారు. చెప్పాలంటే బాధను కలిగిస్తుందన్నారు. సేవ్ పాలస్తీన అన్న మేధావులు ఈరోజు మౌనంగా ఉండటంతో వారు అంతర్గత ఉగ్రవాదులుగా మారారన్నారు. అలంటి వాళ్ళను కూడా గుర్తించి, వాళ్లకు బుద్ధి చెప్పి తీరుతమని అన్నారు. ఈ సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీలో మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశమంతా ఐక్యంగా నిలవాలని ఈ ర్యాలీ గళం విప్పింది. ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులు అర్పించారు.

# ఇండ్లు కేటాయించే వరకు పోరాడుతాం

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

జర్నలిస్టుల చిరకాల కోరిక అయిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లు సాధించి తీరుతామని వరంగల్ తూర్పు జర్నలిస్టులు ధీమా వ్యక్తం చేశారు. డబల్ బెడ్ రూమ్ సాధనకై దేశాయిపేట లక్ష్మీ మెగా టౌన్షిప్ లోని గత ప్రభుత్వం నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్ల ముందు నిర్వహించిన నిరాహార దీక్ష బుధవారం 10వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు పలువురు సంఘీభావం తెలిపారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లు సాధించేవరకు తమ శాంతియుత నిరాహార దీక్ష కొనసాగిస్తూనే ఉంటామని ఈ సందర్భంగా వరంగల్ తూర్పు వర్కింగ్ జర్నలిస్టులు తెలిపారు.



-వరంగల్ తూర్పు జర్నలిస్టులు

వేద న్యూస్

గురువారం ఏప్రిల్ 24, 2025

# మార్కెటింగ్ కోసం మహిళలే దొరికారా..?

■ కొల్లూరు భీమేష్

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**



అందాల పోటీల పేరిట వ్యాపారం చేసుకునేందుకు మార్కెటింగ్ చేసుకోవడానికి కార్పొరేట్లకు మహిళలే దొరికారా? అని ప్రగతి శీల యువజన సంఘం ప్రతినిధి కొల్లూరు భీమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నాడు ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ, రంగులు రుద్దుకొని తళుక్కున మెరిసే వారి కంటే శ్రమైక జీవనంలోనే అసలైన సౌందర్యం ఉందని అన్నారు. రంగులు పూసుకుని షో చేసి 120 దేశాల అందగత్తెలతో పది నిమిషాల పాటు ఉపాధి పనులు చేయిస్తే తట్టెడు మన్ను ఎత్తించి కొంత దూరం నడిపిస్తే వారి అందం ఏమిటో బయటపడుతుందని అన్నారు. అందాల పోటీల పేరిట పెళ్లి కాకుండా 21 ఏళ్లలోపు ఉన్న యువతులను నాలుగేళ్ల పాటు ఫారం కోళ్ల లెక్క పెంచి అంగంగాలు ప్రదర్శించడం దీనికి సంకేతం అని ప్రశ్నించారు. ఇవి పోటీలు ఎలా అవుతాయి అన్నారు. తెలంగాణది మట్టి మనుషులు కల్చరని ఈ గడ్డ పోరాటాల గడ్డ అని ఫ్యూడల్ వ్యవస్థలో దేశ్ ముక్ లు రజా కార్లు నిజాం రాజుకు వ్యతిరేకంగా ఒడిసెలు గన్నులు పట్టి ఆనాడు పోరాడిన పాలకుర్తి ఐలమ్మ సాలమ్మ కమలమ్మ స్వరాజ్యం లాంటి ఎందరో మహిళలు ఈ సందర్భంగా గుర్తుకొస్తున్నారని అన్నారు. ఆయా దేశాలలో వనరులను కొల్లగొట్టి వినిమయ సంస్కృతిని ప్రోత్సహించేందుకు కార్పొరేట్లు అందాల పోటీలను ఇలాంటి గడ్డమీద నిర్వహించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ పెన్షన్ ఇవ్వలేని పరిస్థితిలో ఉండి కూడా ఈ అందాల పోటీలు నిర్వహించడం ఏమిటి?అని ప్రశ్నించారు. అంగట్లో మహిళలు నిలబెట్టడం కిచెన్ టు కింగ్ మేకర్ ఎలా అవుతుందని ప్రశ్నించారు? ఈ అందాల పోటీలను నిర్వహించకుండా ఉపాధి కూలీలకు ఆశా వర్కర్లకు అంగన్వాడీలకు కనీస వేతనాలు పెంచి వారి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టాలని ప్రభుత్వానికి ఒక సూచన చేశారు. అంగన్వాడీలకు కనీస వేతనాలు లేక అంగలారుస్తున్నారని మహిళలను వినిమయ వస్తువుగా చూస్తున్న పితృ స్వామ్య వ్యవస్థను తప్పుపట్టారు.

అంగాంగ ప్రదర్శన చేసే అందాల పోటీలు మహిళల ఆత్మగౌరవానికి ఎలా ప్రతీకలు అవుతాయని ప్రశ్నించారు? కొలతలను బట్టి ఒక మహిళ అందాన్ని నిర్ధారించడం ఏమిటి అని ప్రశ్నించారు. అసలు మహిళ దేహాన్ని కొలతలు వేసే అధికారం వారికి ఎక్కడిది అని నిలదీశారు. మేకప్ కిట్లు మెరిసేందుకు వాడే క్రీములలో పాదరసం ఉంటుందని అది క్యాన్సర్ కారకమని చెప్పారు.

స్త్రీని వినిమయ వస్తువుగా చూడడం ఆత్మగౌరవం ఎలా అవుతుందని ప్రశ్నించారు. అందాల పోటీలలో గెలిచే యువతులు స్పాన్సర్లు చెప్పినట్లు నడుచుకోవలసి ఉంటుందని ఇలా చేయడం అంటే ఆ మహిళ హక్కులను హరించడమే అవుతుందని చెప్పారు. స్త్రీ హక్కులను హరించడానికి తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. అందాల పోటీలను నిరుద్వందంగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# భూ భారతి చట్టం రైతులకు చుట్టం

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం రైతులకు చుట్టం అని బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన ఒక్కొక్క వాగ్దానాన్ని అమలు చేస్తూ, పాలనలో, తమ మార్కు చూపిస్తున్న ముఖ్యమంత్రి కి మంత్రివర్గానికి అభినందనలు తెలిపారు. ఏ పథకం అమలు చేసిన పేదవాడికి న్యాయం చేయాలి అనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పని చేస్తుందని అందుకు ఉదాహరణ "భూభారతి" అని అన్నారు. భూవివాదాల శాశ్వత పరిష్కారానికి తెచ్చిందే భూభారతి చట్టం అని ప్రతి వ్యక్తికి 'ఆధార్ నెంబర్' లాగా ప్రతి భూమికి "భూదార్ నెంబర్" ఇవ్వాలనే నూతన ఆలోచన మంత్రివర్గం చేయడం అభినందనీయమని అన్నారు. గతంలో భూమి రికార్డులను మోసపూరితంగా మార్చిన సంఘటనలు ఉన్నాయని అలా కాకుండా ప్రభుత్వ భూదాన్, అసైన్డ్,దేవాదాయ, భూములను ఎవరైనా పట్టా చేసుకుంటే వాటిని రద్దు చేసేలా సి. సి.ఎల్.ఏ.కి అధికరాలు ఉంటాయని, ప్రభుత్వం నొక్కి వక్కాణిస్తుందని అన్నారు. ఈ విషయాన్ని ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ప్రజలలోకి తీసుకువెళ్లాలని, చేసే మంచి పని పదిమందికి చెప్పడంలో తప్పు లేదని అన్నారు.

ప్రభుత్వం కొత్త చట్టంలో అప్పీలు వ్యవస్థకు అవకాశం ఇస్తుందని ఎవరి భూమి అయినా వేరే వాళ్ళు తప్పుగా నమోదు చేసుకుంటే తహసిల్దార్, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ కు, కలెక్టర్ కు అప్పీల్ చేసే విధంగా చట్టాలు రూపొందించడం జరిగిందని అన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో రైతులకు అన్ని సేవలు గ్రామంలోనే అందుతాయని రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా రైతులకు ప్రజలకు అన్ని సేవలు ఉపయోగపడతాయని అన్నారు.

### ధరణి పేరుతో భూకబ్జాలు..!

గత ప్రభుత్వం ధరణిని అడ్డుపెట్టుకొని రంగారెడ్డి జిల్లాలో వందలాది ఎకరాలను కబ్జా చేసినట్లు వస్తున్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని, గత ప్రభుత్వం కేవలం నలుగురి కోసమే ధరణి చట్టం తెచ్చిందని ఇందుకు భిన్నంగా బడుగు బలహీన వర్గాల ప్రజల రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకువచ్చిందని చెప్పారు. గతంలో ఎవరైనా అక్రమంగా పాసుపుస్తకాలు పొందితే వాటిని రద్దు చేసే అధికారం భూభారతి చట్టంలో ఉందని చట్టంలో కౌలు దారు కాలాన్ని పొందుపరుస్తున్నారని వారికి కూడా న్యాయం జరిగేటట్లు చేస్తారు అనే నమ్మకం ప్రజలలో కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఏది ఏమైనా కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల కోసం బీసీ రిజర్వేషన్లు, మొదలుకొని సన్న బియ్యం, ఎస్సీ వర్గీకరణ, తాజాగా భూభారతి చట్టం అమల్లోకి తెచ్చిందని, బడుగు బలహీన వర్గాల ప్రజలు ఆనందంగా ఉండాలి అనే లక్ష్యం కాంగ్రెస్ పార్టీది, అని శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు.

# అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ నేతలు ఓర్వలేకపోతున్నారు..!

■ వక్కలంక శ్రీనివాసరావు

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**



కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంచేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి భారత రాష్ట్ర సమితి నేతలు ఓర్వలేక పోతున్నారని, ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి వారి కళ్ళకు కనబడడం లేదని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. బుధవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబ ఆర్థిక దోపిడీ చూసి భయపడి కొంతమంది కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారని అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం నుండి సన్న బియ్యం పంపిణీ వరకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆచరిస్తున్నదని అన్నారు. పేద ప్రజల కోసం నిరంతరం క్షేత్రస్థాయిలో పని చేస్తూ దేశ చరిత్రలో నిలిచిపోయే విధంగా సన్న బియ్యం పంపిణీ చేపట్టిందని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని సదుద్దేశంతో రాజీవ్ యువ వికాసం కార్యక్రమం కొనసాగిస్తూ ఉందని దీనితో రాష్ట్రంలో మరికొద్ది మాసాలలో ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయని, ధరణితో విసిగి వేసారిన ప్రజలకు భూభారతి మోక్షం కల్పించిందని సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ ఛాంపియన్ అని కొనియాడారు. ఎస్సీ వర్గీకరణ కుల గణన బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మక నిర్ణయాలు కావా? అని ప్రశ్నించారు. గత ఐదు సంవత్సరాలలో 19,000 చెట్లను భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం నరికివేసిందని ఆదని అంబానీ లో కోసం లక్షల ఎకరాల అటవీ భూములను మోడీ నాశనం చేశారని ఆరోపించారు. తెలంగాణలో సన్నబియ్యం ఎస్సీ వర్గీకరణ బిసి కులగలను వంటి విప్లవాత్మక కార్యక్రమాలు జరుగుతుంటే భారతీయ జనతా పార్టీ నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని భారత రాష్ట్ర సమితి భారతీయ జనతా పార్టీ అభివృద్ధిని అడ్డుకునే పార్టీలుగా నిలిచాయని అన్నారు.

# అన్ని రంగాలలో రాణిస్తున్న రక్షణ కరువు..?

■ ప్రముఖ న్యాయవాది సామాజికవేత్త బండి కనకదుర్గ

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**



దేశంలో ఎంతోమంది బాలికలు యువతులు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారని అలాగే పేదరికం వల్ల వారు చిన్నతనం నుంచే బాల కార్మికులుగా మారిపోతున్నారని ప్రముఖ న్యాయవాది సామాజికవేత్త బండి కనకదుర్గ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నాడు ఆమె పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆడపిల్లలు ఇంటి పనులకు అంకితం కావడం లేదా కుటుంబాల పోషణ కోసం పని మనుషులుగా మారడం ఎక్కువగా కనబడుతోందని అసంఘటిత రంగంలో భవన నిర్మాణంలో ఇటుక బట్టీలలో అమ్మాయిలు ఎక్కువగా పనిచేస్తున్నారని ఆవేదన చెందారు. స్త్రీలు ఎన్నో రంగాలలో ముందడుగు వేస్తున్న నేటికీ చాలా కుటుంబాలలో ఆడపిల్లలను చులకనగా చూస్తున్నారని మన సమాజంలో పాతకపోయిన పితృ స్వామిక భావజాలమే అన్నారు. స్త్రీలే ఈ జగతికి ఆధారం అనే మాటలు పాటలు ఇతర సాహిత్య రూపాలు వినబడుతున్న కనపడుతున్న వాస్తవం అందుకు విరుద్ధంగా ఉంటుంది అన్నారు. చాలా కుటుంబాలను చదువు ఆస్తి ఆర్థిక విషయాలలో అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలకు అవకాశాలు ఉండడం లేదని ఆడపిల్ల అని తెలిస్తే అబార్షన్ చేయించుకుంటున్న వారి సంఖ్య నేటికీ గణనీయంగా ఉంది అని అన్నారు. ( 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతి 1000 మంది పురుషులకు 919 మంది మహిళలు ఉన్నట్లు తెలుస్తోందని 2020 లెక్కల ప్రకారం ప్రతి వంద మంది స్త్రీలకు 108.18 మంది పురుషులు ఉన్నారని మొత్తం జనాభాలో 48.04 శాతం మంది స్త్రీలు ఉండగా 51.96 శాతం మంది పురుషులు ఉన్నారని పేర్కొన్నారు). ముఖ్యంగా మన దేశంలో ఆడపిల్లలు అనేక రకాలుగా వివక్ష ను ఎదుర్కొంటున్నారని చట్టాలు ఎన్ని ఉన్నా స్త్రీలకు రక్షణ లేకపోవడం వారిపై వారిపై హింస తగ్గకపోవడం చాలా బాధాకరమైన విషయమని నేటికీ మనదేశంలో బాల్యవివాహాలు ఎక్కువగానే జరుగుతున్నాయని ప్రతి నలుగురు యువతులలో ఒకరికి బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలుస్తోందని ఉన్నత విద్యను అభ్యసించే అవకాశాలు లేక అనేక లక్షల మంది బాలికలు డ్రాప్ అవుతున్నట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయని అన్నారు. కస్తూరిబా గాంధీ బాలికల మహిళా కళాశాలలు ఏర్పాటు చేసిన వీటిలో సరియైన సదుపాయాలు ఉపాధ్యాయులు మౌలిక వసతులు లేకపోవడం వల్ల బాలికలు చదువుకు దూరం అవుతున్నారని దేశవ్యాప్తంగా అమ్మాయిలు కనీసం టాయిలెట్ సదుపాయాలు లేని పాఠశాలలు ఉన్నాయని విద్యాశాఖ గణాంకాలే చెబుతున్నాయని అన్నారు.

విద్యా విషయం అలా ఉంటే ఆరోగ్యపరంగా చాలామంది ఆడపిల్లలు వెనకబడి ఉంటున్నారని పేదరికం కారణంగా మన దేశంలో ఎంతోమంది బాలబాలికలు యువకులు పోషకాహార లోపంతో బాధపడుతున్నారని అలాగే పేదరికం వల్ల వారు చిన్నతనం నుండి కార్మికులుగా మారిపోతున్నారని ఇంటి పనులకు అంకితం కావడం లేదా కుటుంబ పోషణ కోసం పని మనుషులుగా మారిపోవడం ఎక్కువగా కనబడుతోందని అన్నారు. అసంఘటిత రంగంలో భవన నిర్మాణంలో ఇసుకబట్టిలలో అమ్మాయిలు ఎక్కువగా పనిచేస్తున్నారని పని ప్రదేశాలలో వారికి సౌకర్యాలు ఉండడం లేదని అమ్మాయికి భద్రత లేక లైంగిక వేధింపులకు దాడులకు అక్రమ రవాణా కు గురి ఫోక్సో చట్టం బాలికా సంరక్షణ చట్టాలు ఎన్ని ఉన్నా నేటికీ ప్రతిరోజు పదుల సంఖ్యలో బాలికలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2008 నుంచి బాలికల రక్షణ కోసం జాతీయ బాలిక దినోత్సవం జరుపుకున్న" భేటీ బచావో భేటీ పడావో" సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలు ప్రవేశపెట్టిన నేటికీ బాలికలకు భరోసా కలగడం లేదని స్త్రీలకు సమాన హక్కులు అనే మాట ఆచరణలో నిజం కావడం లేదని ముఖ్యంగా సమాజంలో స్త్రీల పట్ల ఉన్న చిన్న చూపు తక్కువ భావం పోవాలి అని అందుకు ఇంటి నుండే మార్పు రావాలని ఆశించారు. బాలికలకు రక్షణ భద్రతా సంక్షేమం ప్రగతి విషయంలో మరిన్ని మార్పులు రావాల్సి ఉందని వారికి నాణ్యమైన విద్యను అందించాలని సమాన అవకాశాలు కల్పించాలని సమాన వేతనాలు ఉండాలని మూఢనమ్మకాలు మూఢవిశ్వాసాలు విడనాడాలని బాలికల రక్షణ కోసం మరిన్ని నూతన పథకాలు చట్టాలు రావలసిన అవసరం ఉంది అని అన్నారు. శాస్త్రీయ దృక్పథం పెరగాలని లైంగిక వేధింపులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చట్టాలు సక్రమంగా అమలు చేయాలని ర్యాగింగ్ భూతాన్ని తరిమి కొట్టాలని కుటుంబ సభ్యులు ఉపాధ్యాయులు మీడియా పోలీసు న్యాయవ్యవస్థ స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వాలు బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించాలని కోరారు. చదువులలో ఉద్యోగాలలో బాలికలు ఇప్పటికే తమ సత్తా చాటుతున్నారని అనేక రంగాలలో రాణిస్తున్నారని ఇప్పుడు వారికి కావాల్సింది సమాన అవకాశాలు సరియైన ప్రోత్సాహం భద్రత రక్షణ పరంగా సరియైన చర్యలు బాలికల వెనుకబడిన రంగాలను గుర్తించి వారిని ప్రోత్సహించాలని "ఒక దేశం యొక్క అభివృద్ధి ఆ దేశం మహిళ అభివృద్ధిపైనే ఆధారపడి ఉంటుందని" అనే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మాటలు మరవరాదని భవిష్యత్తులో భారత అభివృద్ధి బాలికల అభ్యున్నతి పైనే ఆధారపడి ఉంటుందని పాలకులు ప్రజలు గ్రహించడమే మంచిదని బండి కనకదుర్గ అన్నారు.



## ఐఎస్ఐ పాకిస్తానీ ఉగ్రవాద సంస్థ దిష్టిబొమ్మ దగ్ధం

**వేద న్యూస్, మడికొండ :**

కాశ్మీర్ పెహల్ గాంవ్‌లో లష్కరే తోయిబా పాకిస్తానీ ఉగ్రవాదుల దాడిలో 27 మంది భారతీయ హిందువులను చంపడాన్ని నిరసిస్తూ బుధవారం మడికొండ చౌరస్తాలో భారతీయ జనతా పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు దామెరుప్పుల రమేష్ ఆధ్వర్యంలో మడికొండ బీజేపీ నేతలు ఐఎస్ఐ పాకిస్తానీ ఉగ్రవాద సంస్థ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. భారతీయ టూరిస్ట్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చనిపోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జలగం రంజిత్, జిల్లా నాయకులు పోనగోటి వెంకట్ రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ దువ్వ నవీన్, చెన్నబోయిన శివకుమార్, ఊకంటి వెంకట్ రెడ్డి, పిట్టల రమేష్, చట్ల అజయ్, ధారంగుల రాజేష్, మాచర్ల రంజిత్, కుక్కల రాకేష్, చిరంజీవి, కొడవటి అరవింద్, పండుగ రాజ్ కుమార్, సాయి పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యోగ గెజిటెడ్ ఉపాధ్యాయ కార్మిక సంఘం సమావేశం

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:**

సూర్యాపేట పట్టణం కలెక్టరేట్ రోడ్ లోని త్రిబుల్ ఆర్ ఫంక్షన్ హాల్ లో తెలంగాణ ఉద్యోగుల గెజిటెడ్ ఆఫీసర్స్ ఉపాధ్యాయ కార్మికుల, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ సూర్యాపేట జిల్లా నూతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంను ఉద్దేశించి కమిటీ చైర్మన్ జానిమియా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యోగుల గెజిటెడ్ ఆఫీసర్ల హక్కుల కోసం జాయింట్ యాక్షన్ కమిటీ ద్వారా నిరంతరం పోరాడి హక్కుల కోసం ఐక్య ఉద్యమంగా ఉండాలని తెలియజేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో పట్టణ కమిటీ సభ్యులు తదితర ఉద్యోగుల నాయకులు పాల్గొని మన సంఘం ఐక్యత కోసం పోరాడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీజీ ఈజెఎసి నూతన కమిటీ జిల్లా చైర్మన్ జానిమియా, ప్రధాన కార్యదర్శి భూపాల్, ఉపాధ్యక్షులు బి. పాండు నాయక్, కార్యదర్శి డి. శ్యామ్, కార్యదర్శి డి. స్వామి, కో చైర్మన్ జితేందర్ రెడ్డి, ఉప కార్యదర్శి నాగేందర్, కో చైర్మన్ వీరన్న, కమిటీ సభ్యులు ఎన్.సోమయ్య, పి.వెంకటేశ్వర్లు, ఎం.సుధాకర్ రెడ్డి, జి. జహంగీర్, గౌస్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



## ఎల్కతుర్తి సభను విజయవంతం చేద్దాం

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

ఈ నెల 27 న జరిగే బారత రాష్ట్ర సమితి రజతోత్సవ బహిరంగ సభను వేములపల్లి బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కట్ట మల్లేష్ గౌడ్ కోరారు. బుధవారం వేములపల్లి మండల కేంద్రంలోని శెట్టిపాలెం గ్రామంలో మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ బహిరంగ సభ సంబంధించిన వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనోపేస్టోలో ఇచ్చిన హామీలను మరిచారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పరిపాలనపై వ్యతిరేక వచ్చిందన్నారు. పిఎసిఎస్ మాజీ చైర్మన్ కాట్రగడ్డ రాజగోపాల్ రావు, పిఎసిఎస్ చైర్మన్ నక్క శేఖర్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ పెద్దపంగా సైదులు, ధూపాటి సందీప్, నక్క శ్రీధర్,రాము, చిరుమర్రి నాగయ్య, కట్ట వెంకటయ్య, ఎర్రబెల్లి చంటి, కట్కూరి వేణు, తంగేళ్ల సైదిరెడ్డి, ప్రభాకర్, చెంచు, నరేష్, శ్రీను, సైదులు, రాము, దుర్గాప్రసాద్, విక్రం పాల్గొన్నారు.

## ముష్కరుల ఊహాచిత్రాలు రిలీజ్

మొదటి పేజీ తరువాయి

ఉగ్రవాద దాడుల ఘనటల్లో కూడా ఉన్నట్లు తెలిపారు. ఉగ్రదాడి నుంచి బయటపడిన ప్రత్యక్ష సాక్షులు చెప్పిన వివరాల ప్రకారం ఈ చిత్రాలను తయారు చేసినట్లు భద్రతా సంస్థలు తెలిపాయి. ఉగ్రవాదులను హతమార్చేందుకు, ఆ భయంకర దాడి వెనుక ఉన్న క్రూరమైన ప్రణాళికను వెలికితీసేందుకు భద్రతా సంస్థలు అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నాయి. ఇప్పటికే పాకిస్థాన్ కు చెందిన లష్కరే తోయిబా అనుబంధ సంస్థ రెసిస్టెన్స్ ఫ్రంట్ ఉగ్రదాడికి బాధ్యత వహించింది. ఉగ్రవాదులను పట్టుకునేందుకు ఈ స్కెచ్‌లు కీలకం కానున్నాయి. జమ్ముకశ్మీర్‌లో ఉన్న స్థానికులు ఎవరైనా ఇందులో కనిపిస్తున్న వారి ఆచూకీ తెలపాలని పోలీసులు కోరారు.

### దాడికి రెసిస్టెన్స్ ఫోర్స్ సహకారం!

పహెల్గాం దాడికి వెనుక లష్కరే తోయిబా ఉగ్రసంస్థకు చెందిన కమాండర్ సైఫుల్లా కుసురీ అలియాస్ ఖలీద్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇతనితోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని మరికొందరు ఆపరేటివ్‌లు కూడా ఈ దాడికి సహకరించినట్లు సమాచారం. లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ పాక్ సైన్యానికి అనుబంధంగా పనిచేస్తుంటుంది. లష్కరే సంస్థకు ది రెసిస్టెన్స్ ఫోర్స్ అనేది ముసుగు సంస్థ అని తెలుస్తోంది. వారు పహల్గాంలో మారణ హోమం సృష్టించి, దానిని కెమెరాల్లో చిత్రీకరించినట్టు వార్తలు కూడా వస్తున్నాయి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073